# ఇంటర్వ్యూ

"మీ పిన్ని యివాళ మళ్ళీ ఉత్తరం రాసిందిరా! వాళ్ళన్నయ్య వాళ్ళు వూరికే తొందరపడుతున్నారుట పిల్లకి పెళ్ళి చెయ్యాలని. ఓమారు వెళ్ళి చూసి రాకూడదూ?" అంది అమ్మ గుమ్మంలో అడుగు పెట్టగానే.

"చూద్దాంలే తొందరేవిటి?" అన్నాను.

"మనకి తొందరలేకపోవచ్చు. కాని ఆడపిల్ల కలవాళ్ళ కలా వుంటుందా?"

"వాళ్ళ సంగతెలా వున్నా ముందు నీ హడావిడి జాస్తిగా వుంది" అందామనుకున్నా కాని నాన్నగారు రావడంతో నా నోటికి తాళం పడింది. గుప్‌చిప్‌గా వూరుకున్నాను.

"రేపాదివారం కదా! ఓమారు వెళ్ళి రావోయ్!" అన్నారు.

"రేపా?"

"ఆఁ! వుదయం ఆరుగంటల బస్సులో బయలుదేరితే తొమ్మిదికి వెళ్తావు. పది గంటలకు పిల్లని చూడ్డానికి మంచిది" అంటూ టైమ్‌టేబిల్ ఫిక్సప్ చేసారు.

నేను కాదనలేక మౌనంగా తలూపాను.

మర్నాడుదయం టిక్కట్టు కొనుక్కుని బస్సులో కండక్టరు చూపించిన సీటులో కూర్చున్నా.

"చంపేసారు! బాబూ!"

"రామ! రామ! రామా!"

"పోతులా కళ్ళు కనిపించవూ?"

ఉన్నట్టుండి బస్సులో చిన్న కోలాహలం బయలుదేరింది.

ఏమిటాని? వెనుతిరిగి చూసాను.

ఓ నల్ల కళ్ళద్దాల సూటువాలా త్రోవలో వున్న వాళ్ళ కాళ్ళు నలగత్రొక్కుతూ

వచ్చి నా ఎదురుగా వున్న సీటులో కూర్చున్నాడు.

"ఆ వెధవ కళ్ళజోడు కాస్త తీయకూడదూ? బోడి దర్జా!" అన్నాడో పెద్ద మనిషి సీటు మీద గొంతుక కూర్చుని నలిగిపోయిన పాదం తడువుకుంటూ.

"కళ్ళేమైనా అవుకు కాబోల్రా?" అన్నాడింకో బాధితుడు.

సమాధానంగా సూటువాలా తన నల్లకళ్ళజోడు తీసి చక్రాల్లాంటి కళ్ళనోమారు గిరగిరా త్రిప్పి మళ్ళీ కళ్ళజోడు పెట్టుకున్నాడు.

కండక్టరు వాళ్ళని శాంత పర్చేసరికి వాడి తల ప్రాణం తోకకు వచ్చింది.

"మిస్టర్! మేచస్ వుందా?" అన్నాడు సూటువాలా సిగరెట్ నోట్లో పెట్టుకుని.

లేదన్నట్లు తల అడ్డంగా వూపాను.

ఇద్దరు ముగ్గుర్నడగ్గా ఎవరో ధర్మాత్ముడు అగ్గిపెట్టిచ్చాడు.

గబగబా నాలుగయిదు పుల్లలు గీసి అతి కష్టం మీద సిగరెట్ వెలిగించాడు. గట్టిగా ఒక్క దమ్ము లాగాడో లేదో పాపం-

"సార్! బస్సులో సిగరెట్ కాల్చకూడదు" రూల్ పాస్ చేసాడు కండక్టరు.

"నాన్సెన్స్! ఆ సంగతి ముందే చెప్పాల్సింది" అన్నాడు సూటువాలా కోపంగా.

"చదువుకున్నవాళ్ళు మీరూ అలా అంటే ఎలాగుసార్!"

"ఎదురుగా బోర్డు వుంది చూడమనండి" అన్నాడో కుర్రాడు.

"అయితే ఓ అయిదు నిమిషాలు బస్సాపండి క్రిందకు వెళ్ళి కాల్చుకుంటా" అంటూ లేచాడు.

అతను మళ్ళీ వస్తున్నాడనే భయంతో ఓ అరడజను మంది ఎందుకేనా మంచిదని కాళ్ళు సీటుమీద పెట్టుక్కూర్చున్నారు.

"లాభంలేదు సార్ యిప్పటికే పావుగంట లేటైంది.... రైట్!" అంటూ డ్రైవరుకు కాషనిచ్చేడు కండక్టరు.

సూటువాలా విధిలేక సిగరెట్ బయటకు గిరవాటేసి సీటుమీద కూలబడ్డాడు.

వాడి అవస్థ చూసేసరికి నాకు నవ్వాగింది కాదు.

"ఓహో! నాన్నాజీవా! రారా ఉదయం నుండీ అనుకుంటున్నాను. నువ్వివాళ తప్పకుండా వస్తావని. కూర్చో, అమ్మా నాన్నగారూ అంతా క్షేమమా?" అంది పిన్ని.

"ఆఁ!" అన్నాను కుర్చీలో కూర్చుంటూ.

"మీ బాబాయ్‌గారు నాతో బెట్ చేస్తానన్నారు. నువ్వివాళ రావని. చేసారుకాదు" అంది నవ్వుతూ.

"చేయలేదు కనుకనే వచ్చాడు లేకుంటే రాకనేపోను" అన్నాడు బాబాయ్.

"నిన్ను స్పెషల్ లెక్చరర్‌గా వేసారుట? జీతం కూడా ఏమైనా....?"

"ఆఁ! మరో ఫిఫ్టీ....!"

"కన్‌గ్రాట్యులేషన్స్..... పెళ్ళి చూపులకేనా రావడం" అన్నాడు నవ్వుతూ.

"పేళ్ళు బ్రతకనిస్తున్నారా? ఇవాళ పదిగంటలకు మంచిదిట...." అన్నాను జంకుతూ.

"చేసుకుంటూ చేసుకుంటూ వీళ్ళ సంబంధమే చేసుకోవాలి!"

"ఏం! మా సంబంధానికేం లోటు" అంటూ పిన్ని రెండు కప్పులతో కాఫీ తెచ్చి ఒకటి నాకు యింకొకటి బాబాయ్‌కి యిచ్చింది.

"అబ్బే! ఏ లోటూ లేదు నల్లిగా మసిబొగ్గులా...."

'ఆ మసిబొగ్గులోంచే మాణిక్యాలొస్తాయి కాని యిహ మీరూరుకోండి. ఎవరైనా వింటే నవ్విపోతారు మీ వ్యాఖ్యానానికి"

"మీ వాళ్ళని బాగా సపోర్టు చేస్తున్నావే! నువ్వు కాస్త జాగ్రత్తగా వుండ్రా ఎందుకేనా మంచిది" అంటూ ఫకాలున నవ్వాడు బాబాయ్.

"ఆయనతోనేం కాని నువ్వు స్నానం చేస్తావా? ఈ లోపల అన్నయ్య వాళ్ళకూ కబురు పంపుతా" అంది పిన్ని ఖాళీ కప్పులు అందుకుంటూ.

"ఆఁ ఎందుకు పిన్నీ! అనవసరమైన ఆర్భాటం?"

"సరే నువ్వు త్వరగా స్నానం చేసిరా, నేనూ యీ లోపల రెడీ అవుతా" అంది.

నేను స్నానం చేసి బట్టలు మార్చుకున్నాను. పిన్ని కూడా డ్రస్సు మార్చుకుంది.

"బాబాయ్! నువ్వు రావటం లేదూ!" అన్నాను.

"నేనెందుకురా? మీరిద్దరూ వెళ్ళి రండి అయినా ముగ్గురెళ్ళకూడదు"

పిన్నీ నేనూ వాళ్ళన్నయ్యగారింటికి బయలుదేరాం.

"పిన్నీ రిక్షా మీద పోదామా? చాలా ఎండగా వుంది" అన్నాను.

"ఎందుకూ నాలుగడుగులేగా ఆ ప్రక్క సందులోనే" అంది.

"అమ్మల్ని ఎప్పుడో చిన్నప్పుడు చూసాను. ఇప్పుడెలా వుంటుందో" అని అనుకుంటూ గుమ్మంలో అడుగుపెట్టేసరికి సన్నని శ్రావ్యమైన గొంతుకతో ఏదో పాట వినిపించింది.

"అదుగో అమ్మలు గొంతుక విన్నావా! చక్కగా పాడుతుంది" అంది పిన్ని గబగబా అడుగులు వేసుకుంటూ యింట్లోకి వెళ్ళింది.

నేను మౌనంగా ఆమెననుసరించాను.

"రా! అమ్మాయి సమయానికొచ్చావు. ఇంకా నీకోసం కబురు పంపాలనుకుంటున్నా అమ్మల్ని చూడ్డానికొచ్చారు" అన్న మాటలు వినిపించాయి.

నేను కర్టెను తొలగించి గదిలో అడుగు పెట్టాను.

బస్సులో నాతో కలిసి ప్రయాణం చేసిన నల్ల కళ్ళద్దాల నూటువాలా కుర్చీలో ఠీవిగా కూర్చున్నాడు.

ఎదురుగా చక్కగా అలంకరించుకొని, తలవంచుకొని ముగ్ధలా ముడుచుకొని కూర్చున్న అమ్మల్ని చూసేసరికి నా అడుగు మరి ముందుకు పడలేదు.

*ప్రజామత వీక్లీ, 15-9-1963*